క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఫెయిలైన విద్యార్థులకు మెగా నోటిఫికేషన్

వెంకటాచలం : గత పది సంవత్సరాలుగా విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం మెగా పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు శనివారం తెలియజేశారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు కల్పిస్తున్న చిట్టచివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెగా పరీక్షల నోటిఫికేషన్‌తో పాటు ఇతర వివరాల గురించి యూనివర్సిటీ వెబ్‌సైట్ www.vsu.ac.in లేదా హెల్ప్‌లైన్ 7730943084 నంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

'పవర్ క్వాలిటీ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం.నరేంద్రకుమార్ 'పవర్ క్వాలిటీ' పుస్తకాన్ని రచించారు. దీనిని ఆ కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకంలో పవర్ క్వాలిటీ, హార్మోనిక్ మీన్‌ల గురించి ఎంతో లోతుగా విశ్లేషించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కె.గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

చేపల గుంతలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇందుకూరుపేట : ప్రమాదవశాత్తు చేపల గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని లేబూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామానికి చెందిన తుళ్లూరు చెంచయ్య (55) కుమారుడు చెంచుకృష్ణ లేబూరు గ్రామంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కుమారుడి వద్దకు చెంచయ్య వచ్చారు. కొబ్బరిచెట్ల నుంచి రాలిన ఎండు కొబ్బరికాయలను ఏరుకునేందుకు సమీపాన ఉన్న లేబూరు గ్రామానికి వచ్చారు. ఓ రైతుకు సంబంధించిన చేపల గుంతల వద్ద కాయలను ఏరుకునే క్రమంలో గుంతలో పడిపోయారు. ఇంటి వద్ద పనులు ముగించుకుని చేపల చెరువు వద్దకు వచ్చిన రైతుకు గుంతలో మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై నాగార్జున్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుడు చెంచయ్య అని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రబీ సాగేనా?

మండల పరిధిలోని రైతాంగం సాగుకు సన్నద్ధమవుతోంది. మూడు నెలల క్రితమే వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేసి ఉండడంతో సత్తువ కోసం గతంలో వాటిని పొలాల్లో చల్లిన రైతులు దుక్కి దున్ని నారుమళ్లకు సిద్ధం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎలాంటి పెట్టుబడి సాయం గానీ, హామీ గానీ లేకపోవడంతో అనేక సందేహాల మధ్య సాగు చేపడుతున్నారు.

- పనులకు సన్నద్ధమవుతున్న రైతాంగం
- చెరువులు, వాగుల్లో మోస్తరు నీరు


దుక్కి దున్ని సిద్ధం చేసిన పొలం

మనుబోలు : మండలంలో రైతులు ఏటా 25 వేల ఎకరాలకుపైగా వరి సాగు చేస్తారు. ఇందులో 15 వేల ఎకరాలు కండలేరు ఆయకట్టు కాగా, మరో 10 వేల ఎకరాలు కనుపూరు కాలువకు అనుబంధంగా ఉన్న బండేపల్లి బ్రాంచ్, పొట్టేళ్ల కాలువల పరిధిలో సాగు చేస్తారు. ఈ ఏడాది ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, వాగుల్లో ఇప్పటికే మోస్తరు నీరు ఉండడంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. బండేపల్లి బ్రాంచ్ కాలువ, పొట్టేళ్ల కాలువలపై ఆధారపడి వడ్లపూడి, రాజోలుపాడు, వీరంపల్లి, గొట్లపాళెం, లింగారెడ్డిపల్లి, నాయుడుపల్లి, అక్కంపేట, మడమనూరు, బండేపల్లి, జట్లకొండూరు, కొమ్మలపూడి తదితర గ్రామాల్లో వరి సాగు చేస్తారు. చెరువుల్లో నారుమళ్లకు సరిపడా మోస్తరు నీరు ఉండడంతో ఇప్పటికే రైతులు వ్యవసాయ పనులు మొదలుపెట్టారు. చెరువులకు ఇంకా నీటి విడుదల చేయకపోయినప్పటికీ ఇటీవల వర్షాలకు మోస్తరు వర్షపు నీరు చేరింది. ఇది ప్రస్తుతం నారుమళ్లు వేసేందుకు సరిపోతుంది. అయితే అదనుకు సాగునీరు విడుదల చేయకపోతే పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బ్రాంచ్ కెనాల్ పరిధిలో చివరి ఆయకట్టు రైతులు సాగునీరు అందక, పంటలు ఎండిపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. సకాలంలో సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఊసేలేని పెట్టుబడి సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు 'రైతు భరోసా' పేరిట సంవత్సరానికి మూడు విడతల్లో రూ.13,500 ఆర్థిక సహాయం అందించేది. దీనిని పెట్టుబడి సాయంగా పెట్టి రైతులు దర్జాగా సాగు చేసేవారు. అయితే చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా 'సూపర్‌సిక్స్' కింద రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు పూర్తయినా రైతులకు పెట్టుబడి సాయంపై ఊసే తీయడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడి సాయం అందుతుందా అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల కోసం నమోదు చేసుకోండి



రైతులు విత్తనాల కోసం ఆయా గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. పాసు పుస్తకం, ఆధార్ కార్డులతో వచ్చి బయోమెట్రిక్ విధానంలో నమోదు చేసుకోవాలి. ఒక్కో రైతుకు ఎకరాకు ఒక బస్తా చొప్పున గరిష్టంగా ఐదు బస్తాల విత్తనాలను ఇస్తాం. ఒక్కో బస్తాపై రూ.125 సబ్సిడీ లభిస్తుంది.

– ఏఓ జహీర్

నీటి కొరత రాకుండా చూడాలి



ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో మోస్తరు నీరు మాత్రమే చేరింది. వ్యవసాయ సీజన్ సమీపిస్తుండడంతో ప్రస్తుతం రైతులంతా నారుమళ్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీరు పంట చివరి వరకు సరిపోదు. అధికారులు పంట చేతికొచ్చే వరకు పొలాలకు సాగునీటి కొరత రాకుండా చూడాలి.

– చేడిమాల రమణకుమార్‌రెడ్డి, చెర్లోపల్లి

ప్రభుత్వ సాయం అందించాలి



ఈనెలలో కురిసిన వర్షాలతో వ్యవసాయ పనులు మొదలు పెట్టాం. మాలాంటి సన్నకారు రైతులకు వ్యవసాయ పనులకు పెట్టుబడి పెట్టడం పెద్ద సమస్యగా ఉంటుంది. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం కన్నా అధికంగా రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నాయి. వ్యవసాయ సీజన్ కూడా మొదలైంది. అయితే ఇంతవరకు ప్రభుత్వ సాయంపై స్పష్టత ఇవ్వలేదు. హామీ ఇచ్చిన విధంగా వెంటనే రైతులకు రైతు భరోసా సాయం అందించాలి.

– ఆవుల రమేష్, రైతు, జట్లకొండూరు


మనుబోలు పెద్ద చెరువులో చేరిన నీరు


బండేపల్లి బ్రాంచ్ కెనాల్‌లో అడుగునకు చేరిన నీటి ఊట

కొత్తవంగల్లులో గ్రామసభ


భూ సమస్యలను పరిశీలిస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి

కొడవలూరు : రీసర్వేలో సమస్యలపై మండలంలోని కొత్తవంగల్లులో శనివారం గ్రామ సభ జరిగింది. గ్రామంలో నాలుగు ప్రధాన భూ సమస్యలపై తహసీల్దార్ కె.స్ఫూర్తి క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడారు. గ్రామంలోని పలు భూ సమస్యలు ఉన్నతాధికారుల పరిధిలో ఉన్నాయని, వీటిని కాస్త వ్యవధి తీసుకొని పరిష్కరిస్తామని చెప్పారు. రీసర్వే డీటీ అరుణ్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్, వీఆర్వో ప్రసాద్, గ్రామ సర్వేయర్ ముక్తార్‌బాషా, స్థానిక నాయకుడు చక్కా మదన్ పాల్గొన్నారు.

సన్మానం



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి పవర్ ఆఫ్ పాజిటివ్‌నెస్ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో చిన్నపిల్లల ఆశ్రమ నిర్వాహకుడు శ్రీరామచంద్రశరత్‌ను శనివారం అధికారులు సన్మానించారు. ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

విడవలూరు : మండలంలోని పటేల్‌నగర్ గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. ఆలయంలో సుమారు రూ.లక్ష విలువ చేసే అమ్మవారి ఆభరణాలతో పాటు హుండీని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. హుండీలో దాదాపు రూ.లక్ష నగదు ఉండొచ్చని అంచనా. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వసతి గృహాల్లో న్యాయమూర్తి తనిఖీ


బీసీ వసతి గృహంలో సరుకులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కోవూరు : కోవూరు లోక్‌అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య కోవూరు మండల కేంద్రంలో ఉన్న నాలుగు వసతి గృహాలను శనివారం తనిఖీ చేశారు. ముఖ్యంగా బాలికల వసతి గృహంలో ప్రతి గదిని పరిశీలించారు. బీసీ వసతిగృహంలో బాలికలు ఉండాల్సిన సంఖ్య కంటే అధికంగా ఉండడం న్యాయమూర్తి దృష్టికి వచ్చింది. ఆరు బయట స్నానాలు చేయడం, మరుగుదొడ్లు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ఎలా ఉంది.. అలాగే స్టోర్ రూమ్‌లో ఉన్న పప్పు దినుసులు, ఇతర సామగ్రి నాణ్యతపై ఆరాతీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట వసతి గృహ సంరక్షకులు లక్ష్మి, పద్మజ, మేరీ సుప్రజ, జ్యోతిరాణి, రాంబాబు, గంగాధర్ ఉన్నారు .

రాజకీయాలకతీతంగా పనులు జరగాలి

- ఎంపీపీ గండవరం సుగుణమ్మ


మాట్లాడుతున్న ఎంపీపీ సుగుణమ్మ

ముత్తుకూరు : గత ప్రభుత్వంలో రాజకీయాలకు సంబంధం లేకుండా అన్నివర్గాలకు పనులు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వంలో టీడీపీ వారికి మాత్రమే పనులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ గండవరం సుగుణ విమర్శించారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు జరగాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని, ప్రసంగించారు. ప్రజలచే ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను ప్రస్తుత ప్రభుత్వంలో జరిగే సమావేశాలు, సభలకు పిలవడం లేదని విచారం వెలిబుచ్చారు. తాము సూచించిన పనులు చేసినా, చేయకపోయినా కనీసం సమాచారమైనా ఇవ్వాలని అధికారులను కోరారు. పంచాయతీ కార్యదర్శులు రాజకీయాలకు అతీతంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులను గౌరవిస్తూ సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. ఏకపక్షంగా వ్యవహరించవద్దని సూచించారు. ఎంపీడీఓ నాగమణి, మండల ఉపాధ్యక్షులు జయలక్ష్మి, చిన్నపరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు


ముగ్గులను పరిశీలిస్తున్న వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం : విద్యార్థులు చదువుతో పాటు ఇతర అన్నిరంగాల్లోనూ రాణించాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఫంగస్(శిలీంధ్ర) దినోత్సవం సందర్భంగా మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం ఫంగస్ ఆవశ్యకత అనే అంశంపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థినులు వేసిన ముగ్గులను ఇన్‌చార్జి వీసీ తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. చదువుతో పాటు అన్నిరంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని సూచించారు. ఫంగస్ ఆవిర్భావం, నిర్మాణం, అవి ఎలా వృద్ధి చెందుతాయి.. పర్యావరణంలో వాటి ప్రాముఖ్యత, మానవజాతికి అవి ఎలా ఉపయోగపడుతాయో అర్థవంతమయ్యే రీతిలో ముగ్గులు వేయడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, డాక్టర్ విజయానంద్‌కుమార్ బాబు, డాక్టర్ విద్యా ప్రభాకర్, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

సాక్షి ఎఫెక్ట్..


ట్యాంకర్ నుంచి తాగునీటిని నింపుకుంటున్న గిరిజనులు

మనుబోలు : మండలంలోని పిడూరు గిరిజన కాలనీ వాసులకు అధికారులు శనివారం ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేశారు. 'తాగునీరు రావడం లేదు సారూ' అంటూ శనివారం సాక్షిలో వచ్చిన కథనానికి ఎంపీడీఓ జలజాక్షి స్పందించారు. గ్రామ సర్పంచ్‌తో మాట్లాడి కాలనీకి వెంటనే తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ కుళాయిల ద్వారా ఒకటి రెండు రోజుల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఎట్టకేలకు తాత్కాలికంగానైనా తాగునీరు సరఫరా చేయడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

పొదలకూరు : మండల పరిధిలో ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పడుతోంది. చాలా గ్రామాల్లో మస్టర్ల మాయాజాలం జరుగుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో దుగ్గుంట పంచాయతీలో ఇప్పటికే రూ.లక్షలు గోల్‌మాల్ అయినట్లు ఎంపీడీఓకు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలో ఉన్న కొనగలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే రెండురోజుల క్రితం ఎంపీడీఓకు ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో నిధులు దుర్వినియోగం అవుతున్నట్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు కూడా ఇక్కడ మస్టర్లు వేస్తున్నట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ఈ గ్రామంలో అధికార పార్టీకి చెందిన వారిలో ఒక వర్గం వారు ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది. దీనిపై గ్రామంలో కూడా ఇరువర్గాల మధ్య వివాదాలు చోటుచేసుకున్నట్లు తెలిసింది. మస్టర్లు ఇష్టానుసారం వేసుకుని నిధులు స్వాహా చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు రూ.1.60 లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లుగా వెల్లడిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ డీఎల్ నరసింహారావు వారికి హామీ ఇచ్చారు. అయితే ఆయన కలువాయి ఇన్‌చార్జి ఎంపీడీఓగా వ్యవహరిస్తుండడంతో తీరిక లేక విచారణ చేపట్టలేదని వెల్లడించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మధుసూదన్‌ను విచారణ చేపట్టాల్సిందిగా సూచించినట్లు ఎంపీడీఓ వెల్లడించారు. ఇదే అంశంపై ఏపీఓను వివరణ కోరగా కొనగలూరు గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, విచారణ చేపడుతామని పేర్కొన్నారు. మస్టర్ల వ్యవహారం తనకు తెలియదని వెల్లడించారు.

అయోడిన్ ఉప్పుతో వ్యాధులు దూరం


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ

కొడవలూరు : అయోడిన్ ఉప్పును వాడడం వల్ల థైరాయిడ్, కిడ్నీ తదితర అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని గండవరం గిరిజన కాలనీలో అయోడైజ్డ్ ఉప్పుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ లేని సాధారణ ఉప్పును వినియోగించడం వల్ల హైపో థైరాయిడ్, గాయిటర్, కిడ్నీ వ్యాధులు తలెత్తుతున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందువల్లే జాతీయ స్థాయిలో అయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సాధారణ ఉప్పు వినియోగాన్ని వదిలేసి అయోడిన్ ఉప్పును విధిగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు షంషాద్‌బేగం, రాజేశ్వరమ్మ, రాధిక, ప్రియదర్శిని, ఉమ, మమత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ నిర్వహణపై విద్యార్థులకు అవగాహన


పోలీస్ సిబ్బందితో విద్యార్థులు

విడవలూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే వివిధ కార్యకలాపాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ రైటర్, వీహెచ్‌ఎఫ్ సెట్, టెలీ కాన్ఫరెన్స్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, వివిధ రకాల బందోబస్తులు, పోగొట్టుకున్న ఫోన్ల రికవరీ వంటి పలు అంశాల గురించి విద్యార్థులకు వివరించారు.

వీఎస్‌యూ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం : అందరి సహకారంతో విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) అభివృద్ధికి కృషి చేస్తున్నామని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ వంద రోజుల్లో వీఎస్‌యూలోని అన్ని విభాగాలను పరిశీలించడం, అధ్యాపకులు, విద్యార్థులతో అనేక సమావేశం నిర్వహించడం, వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలలను సందర్శించినట్లు వివరించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థుల సమష్టి సహకారంతో వీఎస్‌యూలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. సమావేశంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ అర్.మధుమతి, డాక్టర్.పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నకు అభినందనల వెల్లువ


ప్రసన్నకు పూల మొక్క ఇస్తున్న సాయికుమార్


ప్రసన్నతో పడుగుపాడు నాయకులు


ప్రసన్నతో అనిల్‌బాబు

కొడవలూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి జడ్డా సాయికుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను ప్రసన్నకు బహూకరించి అభినందనలు తెలిపారు.

- కోవూరు : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో కోవూరు మండలం, పడుగుపాడు పంచాయతీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ నేతలు గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ షేక్ అహ్మద్, తపెట్ల భాస్కర్, రావి నాగార్జున, గొల్లపల్లి తులసీకృష్ణ, నజర్, గరికపాటి అనిల్, సర్దార్‌బాషా పాల్గొన్నారు.
- ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, పొన్నాల కృష్ణారెడ్డి ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.